క్లుప్తంగా

ప్యాలకుర్తిలో దేవర సందడి



ప్యాలకుర్తిలో మారెమ్మ, సవారమ్మ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: ప్యాలకుర్తి గ్రామంలో వెలసిన మారెమ్మ, సవారమ్మల దేవర మంగళ వారం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే దేవరలో భాగంగా ఉదయం మారెమ్మ, శ్రీసవారమ్మ దేవతా విగ్రహ రథాలను మేళతాళాల మధ్య గ్రామ స్తులు ఘనంగా ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం అమ్మవార్లకు బోనాలతో భక్తులు నైవేద్యాలు సమర్పించడం తో పాటు మొక్కులు చెల్లించనున్నారు. దేవరలో భాగంగా 7న ఉచిత నాటక ప్రదర్శన, 8న ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన 9 మంది వృషభాల యజమానులకు వరుసగా బహుమతులుగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున దాతల సహకారంతో అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

క్లాప్ సిబ్బందికి శిక్షణ



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

పాణ్యం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో పాణ్యం, ప్యాపిలి మండలంలో పని చేస్తున్న క్లాప్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం పాణ్యంలోని వర్మీ యూనిట్‌లో చేపట్టిన కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఈఓ ఆనందరావు మాట్లాడుతూ.. చెత్త సేకరణపై ప్రజల్లో క్లాప్ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేస్తే వర్మీ యూనిట్‌లో సేంద్రియ ఎరువు తయారవుతుందన్నారు. అంతేకాక సేంద్రియ ఎరువు తయారు చేసిన తర్వాత స్థానిక రైతులకు విక్రయించాలన్నారు. అనంతరం చెత్త సేకరణ, వర్మీ యూనిట్‌లో సేంద్రియ ఎరువు తయారు విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ చంద్రమౌళేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శివారు కాలనీల అభివృద్ధికి చర్యలు



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: శివారు కాలనీల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మంగళవారం నన్నూరు గ్రామ పరిధిలోని రాగమయూరిలో రూ.10 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో సుమారు రూ.13 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సుబ్బరాయుడు, స్థానిక నాయకులు విశ్వేశ్వరరెడ్డి, విజయుడు, మద్దయ్య, పెద్దమునిస్వామి, ఉసేన్ సర్కార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



విత్తన పరీక్ష చేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులకు విత్తనాలను ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు అమ్మితే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఆయన సి.బెళగల్, కంబదహాల్ గ్రామాల్లోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. పత్తి, కందులు, సజ్జ, మిరప విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. విత్తనాలను ఎంఆర్‌పీకే ఇవ్వాలని, అదేవిధంగా రైతులకు కొనుగోలు రసీద్ తప్పకుండా ఇవ్వాలని దుకాణ డీలర్లకు సూచించారు. సి.బెళగల్‌లోని కిసాన్‌మాల్, శివసాయి ఫర్టిలైజర్స్, ఓం శ్రీ నాగసాయి, ఏజెన్సీస్, విశ్వజిత్ ట్రేడర్స్ దుకాణాల్లో బీటీ పత్తి విత్తనాలకు హెచ్‌టీ పరీక్షలను నిర్వహించగా, అన్ని నెగెటివ్ రిపోర్టు వచ్చాయన్నారు. విత్తన నమూనాలను గుంటూరు ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

ఛత్రపతి సర్కిల్‌గా నామకరణం

కల్లూరు: ఉల్చాల రోడ్డు వై-జంక్షన్‌కు ఛత్రపతి శివాజీ మహరాజ్ సర్కిల్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఛత్రపతి శివాజీ కూడలిని ప్రారంభించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'చెత్త'గించరా..!

- ఖాళీ చేయరూ... బాడుగ చెల్లించరూ...
- ఏపీటీడీసీకి ఉపయోగపడని 1.44 ఎకరాల స్థలం
- స్థలాన్ని ఏళ్ల తరబడి ఉచితంగా వాడుకుంటున్న నగరపాలక సంస్థ



ఏపీటీడీసీ స్థలంలో నిలిపిన నగరపాలక సంస్థ వాహనాలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నడిబొడ్డున వెంకటరమణ కాలనీలో రూ.కోట్లు విలువ చేసే టూరిజం ఆస్తి నిరుపయోగంగా మారింది. పర్యాటకులను ఆకర్షించాల్సిన ప్రాంతం డంపింగ్ యార్డ్‌గా మారింది. రూ.వందల కోట్ల విలువ చేసే ఆస్తి కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లే అవకాశం లేకపోలేదు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. పర్యాటకంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామంటున్న ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చే ఆస్తులను నిర్లక్ష్యం చేయడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. అధికారులు స్పందించి ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆస్తులను ప్రజా ప్రయోజనకరంగా మార్చాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

నిరుపయోగంగా 1.44 ఎకరాల స్థలం

ఒకప్పుడు వెంకటరమణ కాలనీలోని పున్నమి, హరిత రెస్టారెంట్ సందర్శకులతో కళకళలాడేవి. రెస్టారెంట్, వసతి గదులు, ఫంక్షన్ హాల్‌కు ఫుల్ డిమాండ్ ఉండేది. వీటి పక్కనే 1.44 ఎకరాల్లో స్కేటింగ్ రింగ్, విశాలమైన మైదానం ఉన్నాయి. 2002లో ఈ ఆస్తి విలువ రూ.20 కోట్లు.

ప్యాకేజీ టూర్లలో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఏపీటీడీసీ బస్సుల రాకపోకలు ఇక్కడి నుంచే సాగించేవి. అప్పట్లో రూ.లక్షల్లో వ్యాపార లావాదేవీలు జరిగేవి. ఇవన్నీ గతం. ఇప్పుడు ఆ ప్రాంతం డంపింగ్ యార్డ్‌గా మారింది. ఆహ్లాదం పంచాల్సిన ప్రాంతంలో చెత్తను సేకరించే వాహనాలను నిలుపుతున్నారు. చిన్న వాహనాల నుంచి పెద్ద వాహనాల్లోకి చెత్తను మార్చుతుండటంతో ఆ ప్రాంతమంతా చెత్తచెదారంతో దుర్గంధ భరితంగా మారింది. గతంలో ఫంక్షన్ హాల్ నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో కళకళలాడేది. ప్రస్తుతం కంపును భరించలేక ఆ ప్రాంతానికి రావడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. వసతి గదులు సైతం బుక్ కావడం లేదు.

అద్దె చెల్లించరూ...

2020లో అప్పటి కమిషనర్ రెండు నెలలు చెత్త సరఫరా వాహనాలు నిలుపుకుంటామని ఏపీటీడీసీ అధికారుల అనుమతి తీసుకున్నారు. అప్పటి నుంచి చెత్తను సేకరించే సుమారు 30 వాహనాలు, మొబైల్ టాయిలెట్ వాహనాలను అక్కడే నిలుపుతున్నారు. అయితే ఐదు సంవత్సరాల నుంచి ఆ ప్రాంతమంతా నిరుపయోగంగా మారింది. నగరపాలక అధికారులు ఆ స్థలాన్ని ఖాళీ చేయరు. వాడుకుంటున్నందుకు అద్దె కూడా చెల్లించడం లేదు. నష్టాల్లో ఉన్న టూరిజం శాఖకు ఇది ఇబ్బందికరంగా మారింది. డంపింగ్ యార్డ్‌గా మారడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. చుట్టపక్కల కాలనీ వాసులు పలుమార్లు ఫిర్యాదులు సైతం చేశారు. ఏపీ టీడీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సైతం నగర పాలక సంస్థ అధికారులను కలిసి ఆ ఆవరణను ఖాళీ చేయించాలని విన్నవించారు. ప్రస్తుతం నగర పాలక సంస్థ వాహనాలే కాకుండా బయటి వ్యక్తుల వాహనాలకు సైతం పార్కింగ్ స్థలంగా మారింది.

త్వరలోనే ఖాళీ చేస్తామన్నారు



నగరపాలక సంస్థ వాహనాల నిలుపుదలపై నేను డీవీఎంగా బాధ్యతలు స్వీకరించాక నగర పాలక కమిషనర్‌ను కలిసి సమస్యను విన్నవించాం. రెండు నెలల్లోగా ఖాళీ చేస్తామన్నారు. ఇప్పటికి ఒక నెల పూర్తయ్యింది. మరోసారి కలిసి మాట్లాడి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని వినియోగించుకుంటాం.

– లక్ష్మీనారాయణ, డీవీఎం, ఏపీటీడీసీ



నిరుపయోగంగా బస్సుల క్లీనింగ్ భవన్

నేటి నుంచి బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు



కొండపై కొలువైన మాతా గోవిందమాంబ సమేత పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లో బుధవారం నుంచి శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం సభ్యులు తెలిపారు. గ్రామంలోని శ్రీ గట్టు మల్లికార్జున స్వామి కొండ దిగువన అయోధ్యా నగర్‌లోని వీర బ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో రెండు రోజుల పాటు ఆరాధన ఉత్సవాలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం స్వామి వారి 2వ ఆరాధన, సాయంత్రం ప్రభోత్సవం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత గ్రామంలోని శ్రీనివాసులు ఆచారి ఇంటి నుంచి కుంభం కాగు ఆలయానికి చేర్చి, సాయంకాలం 5 గంటలకు రథోత్సవ కార్యక్రయాన్ని ప్రారంభించనున్నారు. రాత్రి 9 గంటలకు భజన బృందాలతో అఖండ భజన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు కోరుతున్నారు.

కుట్టు మిషన్ల నిధులపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గడ్డం రామకృష్ణ

కల్లూరు: బీసీ మహిళలకు కుట్టు మిషన్లు అందజేసేందుకు కేటాయించిన నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని వైఎస్సార్‌సీపీ కురువ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ కోరారు. మంగళవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో బీసీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ.. లక్ష మంది బీసీ మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు ఉచితంగా కుట్టు మిషన్లు, వారికి శిక్షణ కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.230 కోట్లలో దాదాపు రూ.150 కోట్లు పక్కదారి పట్టించారన్నారు. నిధుల గోల్‌మాల్‌పై గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో మంచి పేరు ఉన్న మిషన్లు ఉన్నా వాటిని కాదని గుజరాత్‌లో తయారు చేసిన మిషన్లను మహిళలకు ఇస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకరికే లబ్ధి చేకూర్చేలా టెండర్ విధానం ఉందని, అలాకాకుండా ఏ జిల్లాకు ఆ జిల్లాలో సెక్యూరిటీ, లేబర్ కాంట్రాక్ట్ విధానం అమలు చేయలన్నారు. వైఎస్సార్‌సీపీ గత ఐదేళ్ల పాలనలో సచివాలయాల పరిధిలో ఎంత మందికి సంక్షేమ పథకాలు అందించిందో, నిర్దిష్టమైన డాటా ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో నాయకుల పెత్తనం పెచ్చుమీరిందన్నారు. కుట్టు మిషన్ల పేరిట రూ.150 కోట్లు జేబులో వేసుకున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయ్య ఆచారి అన్నారు. బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. జిల్లాకు 1200 యూనిట్లు బీసీ రుణాలు అని చివరికి 500 యూనిట్లు మాత్రమే ఇచ్చారని యద్దేవా చేశారు. వాటిలో కూటమి పార్టీల అనుయాయులకు కేటాయింపులు జరిగినట్లు సమాచారం ఉందన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

గడివేముల: ఈ నెల 8వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవ గుప్తా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. సర్వసభ్య మండల ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పకడ్బందీగా గ్రామసభలు

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం నుంచి గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో కౌలు కార్డులపై వ్యవసాయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటి రోజు మండల కేంద్రం సి.బెళగల్‌లో, 8న బురాన్‌దొడ్డి, 9న కంబదహాల్, 12న పలుకుదొడ్డి, 13న కొండాపురం, 14న కొత్తకోట, 15 ఇనగండ్ల, 16న పోలకల్, 17న బ్రాహ్మణదొడ్డి రెవెన్యూ గ్రామాల్లో సభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రామ సభల ఉంటాయని, గ్రామ సభలకు కౌలు రైతులు హాజరు అయ్యేలా వ్యవసాయ సిబ్బంది చూడాలని ఆయన అన్నారు. మండల రైతులు సైతం కౌలు కార్డుల నమోదు కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు. సమీక్షలో ఏఈఓ హిమబిందు, వీఏఏలు ఆసీఫ్, ప్రవీన్, ఎంపీఈఓలు వెంకటేష్, సునంద తదితరులు ఉన్నారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం

గడివేముల: మండల కేంద్రంలోని పొదుపు కార్యాలయంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ కార్యక్రమాన్ని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మొదటి విడతగా 50 మందికి ఉచితంగా కట్టు మిషన్‌ను నేర్పించడం జరుగుతుందన్నారు. వీరిలో 70 శాతం హాజరైన మహిళలకు నెలకు రూ.7 వేలు అందించడంతో పాటు ఉచితంగా మిషన్ అందిస్తామన్నారు. అనంతరం బూజునూరులో జాతర సందర్భంగా సుంకులమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాల సదన్ తనిఖీ

కల్లూరు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మంగళవారం పెద్దపాడులోని దామోదరం సంజీవయ్య బాల సదన్‌ను తనిఖీ చేశారు. బాల సదన్‌లో పిల్లలకు అందిస్తున్న ఆహారం, ఆరోగ్య, సంరక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. బాలసదన్ పైకప్పు పెచ్చులు ఊడుతుంటంతో గమనించి అక్కడి అధికారిని విచారించారు. స్లాబ్ రిపేర్ కోసం నిధులు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ శాఖ టెండర్లు పిలిచిందని సంబంధిత అధికారి జడ్జికి వివరించారు. పనులు వెంటనే పూర్తి చేయించాలని సిబ్బందిని జడ్జి ఆదేశించారు.

ఈ-శ్రామ్ కార్డులపై అవగాహన కల్పించాలి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బీ.లిలా వెంకటశేషాద్రి

కర్నూలు(రూరల్): ఈ – శ్రామ్ కార్డుల ఆవశ్యకతపై కార్మికులకు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో మంగళవారం ఈ శ్రామ్ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మికుల దినోత్సవంలో భాగంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ – శ్రామ్ కార్డులు అందేలా కృషి చేస్తామన్నారు. అసిస్టెంట్ లేబరు ఆఫీసరు హేమాద్రి మాట్లాడుతూ ఈ శ్రామ్ కార్డులు పోర్టర్‌లో ఎలా నమోదు చేసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ప్రతి కార్మికునికి రూ. రెండు లక్షల ప్రమాద బీమా ఉచితంగా కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీడీఓ రఘునాథ్, మండల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు రూ. లక్ష విరాళం



చెక్కును దేవస్థానం ఈఓ పీఎస్ రాధాకృష్ణకు అందజేస్తున్న దాత పురుషోత్తం రెడ్డి

కర్నూలు(రూరల్): వెంకాయపల్లె గ్రామ సమీపంలో వెలసిన ఎల్లమ్మ అమ్మవారి ఆలయం అభివృద్ధికి జి.వీరాపురం గ్రామానికి చెందిన పురుషోత్తం రెడ్డి రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఈఓ పీఎస్ రాధాకృష్ణకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఈఓ అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

గర్భిణులకు సకాలంలో సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రఘు

ఓర్వకల్లు: గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. మంగళవారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశాల మాసాంతపు సమావేశాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గర్భిణి వివరాలను 12 వారాల లోపు నమోదు చేయాలన్నారు. ప్రతి కాన్పు ప్రభుత్వ ఆసుపత్రులలో జరిగేలా చూడాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు, కౌమారదశ బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి డా. రాధామోహన్, పీఎచ్ఎన్ విజయలక్ష్మి, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు మంగమ్మ, ఆనమ్మ, ఆశా కార్యకర్తలు, ప్రాజెక్షనిస్టు ఖలీల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిబంధనలు పాటించాలి



గోరంట్లలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో నిబంధనలు తప్పక పాటించాలని ఏపీఓ మోదీన్ బాషా సూచించారు. గోరంట్ల గ్రామంలో ఉపాధి పథకం కింద జరుగుతున్న పనులను ఏపీఓ మోదీన్ బాషా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీల హాజరు, మస్టర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు చేసే చోట కూలీలకు అవసరమైన మంచినీళ్లు, నీడ వసతి సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్ణయించిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేస్తే రోజువారి వేతనం రూ.300 వరకు పడుతుందని ఏపీఓ కూలీలకు సూచించారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే ఉపాధి కింద వారందరికీ పనులు కల్పించడం జరుగుతుందన్నారు. సిబ్బంది కూడా ఆయా గ్రామాల్లోని కూలీలందరికి పనులు కల్పించాలని ఏపీఓ సూచించారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



లద్దగిరిలో నిరసన తెల్పుతున్న ఆశావర్కర్లు

కోడుమూరు రూరల్: అపరిష్కృతంగా ఉన్న ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం లద్దగిరి పీహెచ్‌సీ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ లేబర్ కోడ్‌ను రద్దు చేసి, ఆశా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఆశా కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆశాలకు వర్తింపజేయాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో భాగంగా ఈనెల 20న జరిగే సమ్మెలో ఆశావర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు పీహెచ్‌సీ వైద్యాధికారి డా.భాస్కర్, ఆశా నోడలాఫీసర్ శారదలకు అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు సుబేదా, ఆశ, సరోజ, సువర్చల, సరస్వతి, రేణుక, లక్ష్మి, సుజాత, కృప, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: ఆశావర్కర్లకు కనీసం రూ. 26 వేలు వేతనం ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు మద్దూరు పీహెచ్‌సీలోని డాక్టర్ అభిషేక్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సుబ్బారెడ్డి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గడివేముల: ఆశా వర్కర్లు తమ డిమాండ్లను నెరవేర్చాలని ఆశావర్కర్లు వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు చెన్నమ్మ, ఆశ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: కార్మిక చట్టాల కోడ్‌ల రద్దు డిమాండ్‌తో ఈనెల 20న దేశవ్యాప్త నిరసనలో భాగంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ మోహన్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పోలకల్, సి.బెళగల్ పీహెచ్‌సీలలో ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించి సమ్మెను విజయంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా వారు ఆయా పీహెచ్‌సీలోని వైద్య అధికారులకు ఆశా వర్కర్లతో కలిసి సమ్మె నోటీస్‌లను అందజేశారు. ఆశా వర్కర్ యూనియన్ సభ్యులు ఉష, మంగమ్మ, శైలజ, లక్ష్మీకాంత తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు కిల్కారి కాల్స్



కిల్కారి మెసేజ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కిల్కారి కాల్స్‌ను అందుబాటులోకి తెచ్చిందని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు అన్నారు. మంగళవారం ఆయన ఈ. తాండ్రపాడు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో గర్భిణులను గుర్తించి, వారిని 12 వారాల లోపు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయించాలన్నారు. మాతాశిశు సేవల బలోపేతానికి కిల్కారి మెసేజ్ విధానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 01244451660 నంబరు నుంచి వాయిస్ మెసేజ్‌లు వస్తాయని, గర్భిణుల ఆరోగ్య సమాచారం, సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. ఈ సేవలపై ఆశాలు ఏఎన్ఎంలు ప్రతి రోజు ఐదుగురు గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మాతృపూజ

కర్నూలు కల్చరల్: నెహ్రూనగర్‌లోని సాయి మందిరంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో మాతృపూజ నిర్వహించారు. సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతి పురస్కరించుకొని మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వేదం, భజన, భగవద్గీత శ్లోకాల పఠనం, వైదిక శ్లోకాల పఠనం, సమ్మర్ క్యాంప్ విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమాలు జరిగాయి. సాయి సేవా ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



పీహెచ్‌సీ డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్యకార్యకర్తలు,సూపర్‌వైజర్లు

గడివేముల: రాష్ట్రంలో కొంత మంది ఎంఎల్‌హెచ్‌పీలు.. మండలంలోని ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను అగౌరవ పరిచేలా మాట్లాడితే సహించేది లేదన్నారు. చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సర్వేశ్వరమ్మ, సూపర్‌వైజర్ మనోహర్, ఆరోగ్య సిబ్బంది రాధరాణి, మౌలాబీ, జయమ్మ, విజయభారతి, రమాదేవి, దేవకుమారి, మరియమ్మ పాల్గొన్నారు.

- వైభవంగా బూజునూరు సుంకులమ్మ జాతర

చల్లగా చూడు తల్లీ!



సుంకులమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు,



జాతరకు హాజరైన వైఎస్సార్‌సీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు

గడివేముల: బూజునూరు గ్రామంలో దాదాపు 9 ఏళ్ల అనంతరం చేపట్టిన సుంకులమ్మ జాతరకు జనం పోటెత్తారు. భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద ఎత్తున మహిళలు ప్రదర్శనగా వచ్చి బోనాలతో నైవేద్యం సమర్పించారు. జాతరకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి ఉమామహేశ్వరమ్మలు దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఐకమత్యంగా అందరు కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా మనుషుల ప్రవర్తనలో ఎంతో మార్పు వస్తుందన్నారు. దురలవాట్లను సైతం దూరం చేసుకోవడానికి దైవ కార్యక్రమాలు ఎంతో దోహ పడతాయన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బూజునూరు సుంకులమ్మను మంగళవారం వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, కర్నూలు మేయర్ బీవై రామయ్య, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ సీతారామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోట్ల హరిచక్రపాణిరెడ్డి, కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పాణ్యం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణ రెడ్డి, పార్టీ కన్వీనర్ మధుసూదన్‌గుప్తా, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు పోగుల చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఉశేన్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు దస్తగిరిరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎల్లారెడ్డి, మేఘనాథ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, రవీంద్రారెడ్డి, పుల్లయ్య, గని ప్రతాపరెడ్డి,రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.